క్లుప్తంగా

అర్బన్ మార్కెట్‌కు విశేష స్పందన

ముగిసిన విక్రయాలు



తెనాలిఅర్బన్: స్వయం సహాయక సంఘాల సభ్యులు నిర్వహిస్తున్న అర్బన్ మార్కెట్‌కు విశేష స్పందన లభించింది. అక్కడ ఏర్పాటు చేసిన స్టాల్‌ను పట్టణ వాసులు శనివారం పరిశీలించి పలు వస్తువులు కొనుగోలు చేశారు. ఈసందర్భంగా మెప్మా సీఎంఎం విజయ కుమారి మాట్లాడుతూ స్వయం సహాయక సంఘ సభ్యులు తయారు చేసిన ఉత్పత్తులకు మార్కెట్ కల్పించాలనే ఉద్దేశంతో నెలలో రెండు రోజులు మున్సిపల్ మార్కెట్ వద్ద అర్బన్ మార్కెట్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈనెలలో శుక్ర, శనివారాలలో ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో పలువురు ఆర్‌పీలు, స్వయం సహాయ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

వ్యర్థాలు మురుగు కాల్వల్లో వేయవద్దు

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక



తెనాలిఅర్బన్: మురుగు కాల్వల్లో వ్యర్థాలు వేయకుండా చూడాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక సూచించారు. పట్టణంలోని 30వ వార్డులో శనివారం ఆమె పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులు పరిశీలించి పలు సూచనలు చేశారు. మురుగు కాల్వల్లో చెత్త ఉండటాన్ని గమనించిన ఆమె ప్రజలకు దీనిపై అవగాహన కల్పించాలన్నారు. అలాగే ప్రతిరోజు ఇళ్లకు వెళ్లి చెత్తను సేకరించాలని చెప్పారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణ పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలన్నారు. ఇంట్లో ఉత్పత్తి అయిన చెత్తను కార్మికులకు అందజేయాలని సూచించారు. ఆమె వెంట అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతి, కౌన్సిలర్ కొమరబత్తిని జయపాల్, ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, ఎఈ సునీల్, పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌పై న్యాయవాది ఫిర్యాదు

తెనాలిరూరల్: పట్టణంలో పలు సమస్యలపై మున్సిపల్ కమిషనర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పట్టణానికి చెందిన న్యాయవాది పెరికల డేనియల్ పురపరిపాలన శాఖ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పట్టణంలో వీధి కుక్కలు, ఖాళీ స్థలాలు, వంటి సమస్యల గురించి మండల న్యాయసేవాధికార సంస్థలో ఫిర్యాదు పీఎల్‌సీ వేయగా చర్యలు తీసుకుంటున్నట్టు కమిషనర్ వివరణ ఇచ్చారు. వాస్తవంలో చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలమయ్యారని పుర పరిపాలన శాఖ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేయగా, విచారించి తగు చర్యలు తీసుకోవడమే కాకుండ తీసుకున్న చర్యల గురించి ఫిర్యాదుదారుకు వివరాలు అందించాలని పుర పరిపాలన శాఖ డైరెక్టర్ మున్సిపల్ రీజనల్ డైరెక్టర్‌ను ఆదేశిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారని న్యాయవాది డేనియల్ తెలిపారు.

పూర్వ విద్యార్థుల వనసమారాధన



తెనాలిరూరల్: మండలంలోని కొలకలూరు జెడ్పీ హైస్కూలు 1987-88 బ్యాచ్ ఆధ్వర్యంలో కార్తిక వనసమారాధనను శనివారం గ్రామంలోని అరటి తోటల్లో నిర్వహించారు. పూర్వ విద్యార్థులందరూ చిన్నారి స్నేహం పేరిట గ్రూప్ ఏర్పాటు చేసుకుని వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. కార్యక్రమానికి హైదరాబాద్ జీఎస్టీ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ యద్దల శ్రీలీల ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తన్నీరు సుబ్బారావు, కరేటి శ్రీనివాసరావు, తన్నీరు పద్మజ, కె. శైలజ, కనిగినీడి సీతారామాంజనేయులు, అంకట రమేష్‌బాబు, తాళ్ల శ్రీహరి, షేక్ ఖలీల్, ఏపూరి శ్రావణ్ కుమార్, అంబటి కాశీవిశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాలను రూపొందించండి



తెనాలిఅర్బన్: విద్యార్థులలో ఐక్యూ పెరిగే విధంగా పాఠ్యపుస్తకాలను రూపొందించాల్సిన అవసరం ఎంతైన ఉందని నెహ్రూనికేతన్ విద్యా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్ పేర్కొన్నారు.నెహ్రూనికేతన్ లీడ్ స్కూల్ ఆధ్వర్యంలో కొత్తపేటలోని ది కాకతీయ కో అపరేటివ్ సొసైటీ కార్యాలయంలో శనివారం ఉపాధ్యాయుల అవగాహన సదస్సును నిర్వహించారు. లీడ్ స్కూల్ వారు టెక్ బుక్ పేరుతో రూపొందించిన పుస్తకాలను ఆవిష్కరించారు.

ఐసీయూ విభాగానికి వీడని గ్రహణం

- ఆరు సంవత్సరాలైనా పూర్తికాని సిబ్బంది నియామకం
- పోస్టులు రద్దు చేసిన ప్రభుత్వం
- నేటికీ తెనాలి చేరని వెంటిలేటర్లు
- ఆక్సిజన్‌లతో సరిపెడుతున్న అధికారులు



హెచ్‌డీయూలో చికిత్స పొందుతున్న రోగులు



తెనాలి జిల్లా వైద్యశాలలో ఏర్పాటు చేసిన ఐసీయూ విభాగం

తెనాలిఅర్బన్: తెనాలి జిల్లా వైద్యశాలలో ఏర్పాటు చేసిన ఇంటెన్సీవ్ కేర్ యూనిట్(ఐసీయు) విభాగానికి పట్టిన గ్రహణం వీడటం లేదు. దీనిని ఏర్పాటు చేసి ఆరు సంవత్సరాలు దాటిన నేటికీ దానిలో వైద్యులు, సిబ్బంది నియామకం జరగలేదు. ఇదిలా ఉంటే దీనికోసం మంజూరు చేసిన వైద్యులు, సిబ్బంది పోస్టులను ప్రభుత్వం రద్దు చేస్తు ఉత్తర్వులు జారీ చేసింది. చేసేది లేక జిల్లా వైద్యశాలలోని ఫిజీషియన్‌లే దీనిలో చేరిన రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు.

తెనాలి జిల్లా వైద్యశాలలో రూ.22 లక్షలతో 2018 లో ఐసీయూను ఏర్పాటు చేశారు. దానిని రెండు విభాగాలుగా విభజించి ఐసీయూ-20, హెచ్‌డీయూ-8 బెడ్‌లను ఏర్పాటు చేశారు. హెచ్‌డీయూ బెడ్‌లకు వెంటిలేటర్, ఆక్సిజన్ అందించే ఏర్పాటు చేశారు. మిగిలిన 20 బెడ్‌లకు కేవలం ఆక్సిజన్ అందించే సదుపాయాన్ని ఏర్పాటు చేశారు.

పోస్టులను రద్దు చేసిన ప్రభుత్వం

తెనాలి జిల్లా వైద్యశాలకు ఐసీయూ విభాగంలో సేవలు అందించేందుకు నాలుగు ఫిజీషియన్ వైద్యుల పోస్టులు, ఎనస్తీషియా-4, టెక్నీషియన్‌లు, స్టాఫ్ నర్సులు కలిపి-22 పోస్టులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఆ సమయంలో ఒక ఎనస్తీషియా వైద్యురాలిని తెనాలి కూడా పంపారు. ఆమె వచ్చి ఒక్కరే 24 గంటలు సేవలందించాలంటే కష్టమని చెప్పి వెనక్కి వెళ్లిపోయారు. స్టాఫ్ నర్సులను కొత్తవారిని నియమించే లోపు ఉన్నవారిలో కొందరిని ఐసీయూ సేవలకు ఉపయోగించుకోవాలని ఉన్నతాధికారులు సూచించారు. దీంతో ముగ్గురు స్టాఫ్ నర్సులను గుంటూరులోని జీజీహెచ్‌కి శిక్షణ నిమిత్తం గతంలో పంపారు. ఆ తర్వాత ఏమి జరిగిందో ఏమో ఆ ఊసే లేకుండా పోయింది.

దీంతో వైద్యులు, సిబ్బంది నియామకాలు జరగక జిల్లా వైద్యశాలలో పనిచేసే వారితో అక్కడ సేవలు అందిస్తు వస్తున్నారు. ఇదిలా ఉంటే ప్రభుత్వం ఐసీయూకు మంజూరు చేసిన పోస్టులను రద్దు చేస్తు ఇటీవల ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఇప్పటి వరకు ఉన్న ఆశలు కూడా అడియాశలు ఆయినట్లు అయ్యింది.

అందుబాటులో ఉన్న నామామాత్రపు వెంటిలేటర్

ఐసీయూ విభాగంలో హెచ్‌డీయూ బెడ్‌లు-8 ఏర్పాటు చేశారు. వాటికి వెంటిలేటర్ సదుపాయాన్ని కల్పించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆ సమయంలో ముక్కు ద్వారా అందించే వెంటిలేటర్‌లను తెనాలి పంపారు. వాటిని ఏర్పాటు చేసి సేవలు అందిస్తుండగా కోవిడ్ ఉధృతమైంది. ఆ సమయంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జిల్లా వైద్యశాలలో ఆక్సిజన్ ప్లాంట్‌లను ఏర్పాటు చేసి వైద్యశాలలోని అన్ని బెడ్‌లకు ఆక్సిజన్ సదుపాయాన్ని కల్పించింది. అలాగే సుమారు 300 వెంటిలేటర్‌లను గత ప్రభుత్వం తెనాలి పంపింది. కోవిడ్ ఉధృతి తగ్గటంతో అధికారులు వెంటిలేటర్‌లను తొలగించి గదిలో భద్రపరిచారు. ప్రస్తుతం ముక్కుల ద్వారా అందించే వెంటిలేటర్ సదుపాయం మాత్రమే ఉంది. గొంతులో వేసే వెటిలేటర్ సదుపాయం అందుబాటులో లేదు.

ఇప్పటికైనా పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి ఐసీయు విభాగానికి నూతన పోస్టులు మంజూరు చేయటంతో పాటు వెంటిలేటర్ సదుపాయాన్ని ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ఉన్నతాధికారులను కోరాం



తెనాలి జిల్లా వైద్యశాలలోని ఐసీయూ కోసం నేషనల్ హెల్త్ మిషన్ ప్రోగ్రామ్‌లో భాగంగా 30 పోస్టులు మంజూరు చేశారు. ఆ సమయంలో కొందరు వచ్చి విధులలో చేరి వివిధ కారణాల వల్ల వారు వెళ్ళిపోయారు. అప్పటి నుంచి అందుబాటులో ఉన్న ఫిజీషియన్, సిబ్బందితో ఐసీయూ నిర్వహణ చేస్తున్నాం. ఇటీవల ప్రభుత్వం ప్రోగ్రామ్‌ను రద్దు చేయటంతో పోస్టులు రద్దు అయ్యాయి. ఐసీయూకు నూతన పోస్టులు మంజూరు చేయాలని ఉన్నతాధికారులను కోరాం. వారి అనుమతి రావాల్సి ఉంది.

--డాక్టర్ మజీదా బేగం, ఇన్‌చార్జి జిల్లా సమన్వయకర్త, డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్

గురజాడకు ఘన నివాళి



పుత్తడి బొమ్మ పూర్ణమ్మ గేయ ప్రదర్శనలో చిన్నారులు

తెనాలిరూరల్: తన రచనల ద్వారా సాంఘిక పరివర్తనకు ప్రయత్నించి తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన గొప్ప సాహితీకారుడు గురజాడ అప్పారావు వర్ధంతిని పురస్కరించుకుని విద్యార్థులు, ఉపాధ్యాయులుల ఆయనకు ఘన నివాళి అర్పించారు. మండలంలోని అంగలకుదురు జెడ్పీ హైస్కూలులో శనివారం జరిగిన కార్యక్రమంలో గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్.అనురాధ మాట్లాడుతూ గురజాడ అప్పారావు జీవిత విశేషాలు, సమాజం కోసం ఆయన చేసి కృషిని వివరించారు. సభ అనంతరం గురజాడ రచించిన పుత్తడి బొమ్మ పూర్ణమ్మ గేయ నృత్యరూపకాన్ని విద్యార్థులు ప్రదర్శించారు. పూర్ణమ్మగా అపర్ణ, ముసలి మొగుడుగా వైష్ణవి, పూర్ణమ్మ తండ్రిగా కరీమున్నీసా, తల్లిగా పల్లవి, పోలేశ్వరి, తిరుపతమ్మ, ఇతఈతర పాత్రల్లో శాంతి, కరుణ, సాయిశ్రీ, అవిల, హాసిని, యాస్మిన్, స్రవంతి, పావని నృత్యరూపకంతో అలరించారు. పగడాల భారతీదేవి దర్శకత్వం వహించగా, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తెనాలిలో 95 శాతం పింఛన్‌ల పంపిణీ



పింఛన్‌లు పంపిణీ చేస్తున్న కమిషనర్ శేషన్న

తెనాలిఅర్బన్: సామాజిక పింఛన్‌ల పంపిణీ శనివారం ఉదయం నుంచి తెనాలి పట్టణంలో జరిగింది. సచివాలయ ఉద్యోగులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్‌లను పంపిణీ చేశారు. మాదల వారి వీధిలో జరుగుతున్న పింఛన్‌ల పంపిణీని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పరిశీలించారు. త్వరగా పింఛన్‌ల పంపిణీని పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే కొందరు లబ్ధిదారులకు పింఛన్‌లను ఆయన పంపిణీ చేశారు.చినరావూరుతోటకు చెందిన ఆరమళ్ళ శారమ్మ కిడ్నిల వ్యాధితో బాధపడుతూ గుంటూరులోని ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతుంది. విషయం తెలుసుకున్న సచివాలయ వెల్ఫేర్ సెక్రెటరీ యలవర్తి మాధవి అక్కడికి వెళ్ళి డయాలసిస్ పింఛన్ కింద రూ.10వేల నగదు పంపిణీ చేశారు. తెనాలి పట్టణంలో సాయంత్రం 6 గంటల సమయానికి 95 శాతం పంపిణీ పూర్తి అయిందని అధికారులు తెలిపారు.

కొల్లిపరలో....

కొల్లిపర: శనివారం మండలంలో అధికారులు వారికి కేటాయించిన పరిధిలో ఇంటింటికి వెళ్లి పింఛన్ ఇవ్వటం జరిగిందని ఎంపీడీవో వి.విజయలక్ష్మి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మండలంలో 20 గ్రామాలల్లో 9668 మంది వివిధ ఫింఛన్ లబ్ధిదారులు ఉన్నారు అని వీరికి రూ.3,95,12,500 పంపిణీ చేయాల్సిండగా సాయంత్రం 5గంటలలోపు 9086 మందికి రూ.3,71,17,000 పంపిణీ చేసినట్లు తెలిపారు. మిగిలిన 582 ఫించన్లు రాత్రి 10 లోపు అందిస్తామని తెలిపారు. ఇంటి వద్ద లేని వారికి సోమవారం కూడా అధికారులు ఇంటి వద్దకు వచ్చి అందించటం జరగుతుందని పేర్కొన్నారు.

రాజ్యాంగం మెజార్టీ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చాలి

రాజ్యాంగంపై చర్చాగోష్ఠిలో 'విరసం' సీఎస్ఆర్‌కే ప్రసాద్



మాట్లాడుతున్న సీఎస్ఆర్‌కే ప్రసాద్

తెనాలి: భారత రాజ్యాంగం దేశంలోని మెజారిటీ ప్రజల అశలు, ఆకాంక్షలను నెరవేర్చినపుడే అందరూ దాన్ని సొంతదిగా భావిస్తారని, రాజ్యాంగానికి, ప్రజలకు మధ్య అనుసంధానం ఉండాలని విప్లవ రచయితల సంఘం నాయకుడు సీఎస్ఆర్‌కే ప్రసాద్ అభిప్రాయపడ్డారు. పట్టణానికి చెందిన సాహితీ, సాంస్కృతిక వేదిక 'భిన్నస్వరాలు' ఆధ్వ ర్యంలో శనివారం సాయంత్రం ఇక్కడి కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో 'భారత రాజ్యాంగం: మంచి చెడు' అనే అంశంపై చర్చావేదికను నిర్వ హించారు. భారత రాజ్యాంగ వజ్రోత్సవాల సందర్భంగా ఏర్పాటైన ఆ చర్చాగోష్ఠికి సమన్వయకర్తగా జీఎస్ నాగేశ్వరరావు వ్యవహరించారు. సీఎస్ఆర్‌కే ప్రసాద్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ, 75 ఏళ్ల సుదీర్ఘకాలంలో రాజ్యాంగం ప్రకారంలో పేర్కొన్న లక్ష్యాలను ఏమేరకు సాధించాం, ఆచరణలో ఎంతవరకు విజయవంతమైందీ చర్చ జరగాలన్నారు. రాజ్యాంగ ప్రవేశికలో పేర్కొన్న సామ్యవాదం, లౌకికవాదం గురించి స్పష్టత లేదన్నారు. రాజ్యాంగంపై చర్చ ఆచరణవైపు నుండి జరగాలనీ, న్యాయమూర్తులు కూడా భిన్నమైన వ్యాఖ్యలు చేస్తున్నారని, పాలకవర్గాలు అస్పష్టతను కొనసాగిస్తున్నాయని వివరించారు. ఆచార్య నాగార్జున యూనివర్శిటీ రాజనీతిశాస్త్ర ఆచార్యుడు వి.అంజిరెడ్డి మాట్లాడు తూ చాలా దేశాలకు భిన్నంగా, భారతదేశం స్వాతంత్ర్యం సమకూరిన వెంటనే ఆధునిక రాజ్యాంగాన్ని రూపొందించుకుని ప్రజాస్వామ్య పాలనకు దిగటమనే సాహసానికి పూనుకుందని చెప్పారు. భారత్‌లో ఇది ఎక్కువకాలం నిలిచేది కాదని భావించిన పాశ్చాత్యులు ఆశ్చర్యపోతున్నార ని అన్నారు. ప్రజాస్వామ్య భావనలో చాలా పరిమిత హక్కులను గ్రహింపగలగటం వల్లనే ప్రజాస్వామ్యం కొనసాగుతోందని చెప్పారు. రాజ్యాంగం అనే పదం సరైంది కాదనీ, రాజ్యశాసనంగా సాధ్య మైనంత తర్వగా మార్చుకోవాలన్నారు. సమన్వయకర్త జీఎస్ నాగేశ్వరరావు మాట్లాడుతూ, రాజ్యాంగంలోని వయోజన విద్యతో పేదరికం గణనీయంగా తగ్గిందనీ, ఓటు హక్కుతో రాజకీయ సమానత్వం ప్రసాదించిందనీ, సామాజిక సమానత్వంలోనూ ఒక అడుగు ముందుకు పడిందన్నా రు. సంస్థ కన్వీనర్ కేవీ రాఘవరెడ్డి స్వాగతం పలికి న సభలో జుగాష్‌విలి, ఉమారాజశేఖర్, పిల్లి వాసు, కనపర్తి బెన్‌హర్, వై.అశోక్‌కుమార్, లలితానంద ప్రసాద్, దేవిశెట్టి కృష్ణారావు, జాలాది మోజెస్ పాల్గొన్నారు.

ఏఎన్‌యూలో ఘటనకు ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం

వైఎస్సార్‌ఎస్‌యూ ఆరోపణ



ఏఎన్‌యూ వీసీ గంగాధరరావుకు వినతిపత్రం సమర్పిస్తున్న వైఎస్సార్‌ఎస్‌యూ నాయకులు

పెదకాకాని: ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలో మహిళా వసతి గృహాల్లో విద్యార్థినుల భోజనంలో జెర్రిలు, కప్ప, పురుగులు వచ్చిన ఘటనకు కూటమి ప్రభుత్వ నిర్లక్షమే ప్రధాన కారణమని వైఎస్సార్ విద్యార్థి సంఘం(వైఎస్సార్‌ఎస్‌యూ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.రవిచంద్ర ఆరోపించారు. ఈ ఘటనకు నిరసనగా శనివారం యూనివర్సిటీ ప్రధాన ద్వారం ఎదుట నిరసన తెలిపారు.

అనంతరం యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య కె.గంగాధర్ రావుకు వినతిపత్రం అందజేశారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని వీసీని కోరారు. ఈ సందర్భంగా రవిచంద్ర మాట్లాడుతూ విద్యార్థినుల భోజనంలో కప్ప రాలేదనీ, భోజనం కలుషితం కాలేదని వీసీ చెప్పడం తగదన్నారు. విద్యార్థినులు తినే భోజనంలో కప్ప రాకుంటే వేలాదిమంది విద్యార్థినిలు వీసీ భవనం ముందు ఎందుకు ధర్నా చేశారని ప్రశ్నించారు. విశ్వ విద్యాలయాలను కూటమి ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యంగా నిర్వహిస్తుందో ఈ ఘటనే నిదర్శనమన్నారు. తక్షణమే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో వైఎస్సార్ విద్యార్థి సంఘం నాయకులు కె.శివారెడ్డి,ఐ శ్రీనివాస్,ఎస్.ప్రతాప్, యస్వంత్ రెడ్డి, కుమార్ పాల్గొన్నారు.

హడలెత్తిస్తున్న ఫెయింజల్లులు



ధాన్యం రాశులపై టార్పాలిన్‌లు, బరకాలు కప్పుతున్న రైతులు



వర్షం కారణంగా హడావిడిగా ధాన్యం బస్తాలకు నింపుతున్న రైతులు

- తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షం
- ధాన్యం రాశులపై టార్పాలిన్‌లు, బరకాలు కప్పి కాపాడుకుంటున్న రైతాంగం

కొల్లిపర: ఫెయింజల్ తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షంతో రైతులు నానా అగచాట్లు పడుతున్నారు. శనివారం సాయంత్రం ఆకాశం మేఘావృతమై ఒక మాదిరి వర్షం ప్రారంభం కావటంతో రైతాంగం ధాన్యం ఒబ్బిడి చేసుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. తెనాలి నియోజక వర్గంలో సుమారు 32 వేల ఎకరాలు రైతులు వరి సాగు చేస్తున్నారు. కొల్లిపర మండలంలో 20 గ్రామాల్లో 12,482 ఎకరాల్లో రైతులు వరి సాగు చేపట్టారు. వరి కోతలు నియోజక వర్గంలో ఇప్పుడిప్పుడే ఊపందుకుంటున్నాయి. ఈ తరుణంలో తుఫాన్ ప్రభావంతో వర్షాలు పడటంతో యంత్రాలతో వరి కోతలు నిర్వహిస్తున్న రైతులకు, కోతలు నిర్వహించి ధాన్యం రాశులను రహదారులు వెఇంట, గృహాలు మధ్య ఖాళీ ప్రదేశాల్లో ఆరబోయటానికి ఉంచిన రైతులకు ఆటంకం ఏర్పడింది. దీంతో వరి కోత యంత్రాలతో నూర్పిడి చేసిన ధాన్యాన్ని రాశులు చేసి, ఎక్కడిక్కడ ఉన్న ధాన్యం పై టార్పాలిన్‌లు, బరకాలు కప్పారు. తుఫాన్ ప్రభావంతో రెండు రోజులు పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతాంగం అప్రమత్తమైంది. దీంతో గత రెండు రోజులుగా వరి కోతలను రైతులు వాయిదా వేసుకున్నారు. నెల రోజుల క్రిందట వరి పొట్ట దశలో ఉండగా ఇలాగే తుఫాన్ కారణంగా అధిక వర్షాలు పడి వరి పంట కొంత మేరకు నష్టం జరిగింది. అప్పటి వర్షాలు కారణంగా వరిపొట్ట దశలో ఉండటం వలన ప్రస్తుతం పంట దిగుబడి తగ్గింది.

ప్రస్తుతం దిగుబడి తగ్గిన కొంత మేరకు పంట కోతలు నిర్వహించి బయట పడుతున్నాం అనే లోపలే మరల మరొక తుఫాన్ కారణంగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ఇప్పుడు గాని అధికంగా వర్షా లు పడితే కోతకు సిద్ధంగా ఉన్న వరి పైరు నేలకు వరిగి పూర్తిగా నేలపాలై పూర్తిగా నష్టం పోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధిక వర్షాలు పడితే కోతలు నిర్వహించని రైతులను ప్రభుత్వం ఎకరానికి రూ.50 వేలు నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని కోరుచున్నారు.

ఆకట్టుకున్న బృందగానం



సంకీర్తనలు గానం చేస్తున్న గాయకులు

తెనాలి: పట్టణ నెహ్రూరోడ్డులోని శ్రీరుక్మిణీ సమేత గోవర్ధనస్వామి/ శ్రీఆంజనేయ స్వామి దేవాలయంలో శనివారం సాయంత్రం శ్రీహరి నామ సంకీర్తన బృందంచే సంకీర్తన గానం జరిగింది. గురువు పెరవలి వంశీకృష్ణ ,అందె బాలచంద్రమౌళి, అందె రాజేశ్వరి, తన్మయి, మాదల నాగఅర్చన, రూపశ్రీ, కొత్తమాసు పుష్పలత, దంటు శర్వాణి, పువ్వాడ విష్ణుప్రియ, శ్రీపూజిత, వేమవరపు లక్ష్మి నరసింహారావు, టీవీఎస్ శాస్త్రి సంకీర్తనలలో పాల్గొన్నారు. శ్రీఆంజనేయస్వామి దేవస్థానం ప్రధాన అర్చకుడు లక్ష్మీనారాయణ నేతృత్వంలో ఈ కార్యక్రమం చేశారు. ప్రతి శనివారం హిందూ ధర్మ ప్రచార పరిషత్, టీటీడీ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతి శనివారం గోవర్ధనస్వామి దేవాలయంలో వారం భజన ఉంటుందనీ, డిసెంబర్ నెలలో తిరుమలలో ఇదే బృందంచే భక్తిరంజని ఉంటుందని వంశీకృష్ణ తెలియజేశారు.

తెనాలి ఫొటోగ్రాఫర్‌కు పురస్కారం



ఆచార్య కె.రామమోహనరావు నుంచి అవార్డు స్వీకరిస్తున్న రవికుమార్

తెనాలి: తెనాలికి చెందిన ఫొటోగ్రాఫర్, తెనాలి కెమెరా క్లబ్ కార్యదర్శి ఓలేటి రవికుమార్ తీసిన రెస్ట్ టైం ఫొటోకు కెప్టెన్ టీఎఫ్ గెటి స్మారక అవార్డు లభించింది. 132వ ప్రపంచ పిక్టోరియల్ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా జరిగిన పోటీల్లో ఈ గౌరవం దక్కింది. ఇండియా ఇంటర్నేషనల్ ఫొటోగ్రాఫిక్ కౌన్సిల్, ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియాతో కలిసి ఆచార్య నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్స్/ఫొటోగ్రఫీ విభాగం ఈ పోటీలను నిర్వహించింది. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన విజేతలకు శనివారం వర్సిటీలో జరిగిన 132వ ప్రపంచ పిక్టోరియల్ ఫొటోగ్రాఫిక్ ఉత్సవాలు-2024లో అవార్డులను బహూకరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఇన్‌చార్జి చైర్మన్ ప్రొఫెసర్ కె.రామమోహనరావు చేతుల మీదుగా రవికుమార్ ఈ అవార్డును స్వీకరించారు. పోటీల సమన్వయ కర్త, ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా చైర్మన్ తమ్మా శ్రీనివాసరెడ్డి, లా కాలేజీ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సురేష్‌కుమార్, యూనివర్సిటీ జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్స్/ఫొటోగ్రఫీ విభాగం ఇన్‌చార్జి డాక్టర్ జె.మధుబాబు పాల్గొన్నారు.



అవార్డు పొందిన ఫొటో

జీవనశైలి మార్పులతోనే అలర్జీలకు అడ్డుకట్ట

మంగళగిరి: జీవన శైలిలో మార్పులతోనే అలర్జీలకు అడ్డుకట్ట వేయొచ్చని పలువురు వైద్య నిపుణులు తెలిపారు. నగర పరిధిలోని చినకాకానిలో ఉన్న ఎన్‌ఆర్ఐ ఆసుపత్రిలో రెండు రోజుల సదస్సు శనివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా పలువురు వైద్య నిపుణులు మాట్లాడుతూ నేటి కాలంలో మారిన ఆహారపు అలవాట్లు, జీవన శైలి కారణంగా అనేక రుగ్మతలు పెరుగుతన్నాయన్నారు. అందులో అలర్జీ అధికంగా వ్యాపిస్తోందన్నారు. ముఖ్యంగా చిన్న పిల్లల్లో అలర్జీలు అధికంగా పెరగడం ఆందోళనకు గురిచేస్తుందన్నారు. చర్మ వ్యాధులు, అలర్జీలు సంఖ్య పెరుగుతుండడంపై వైద్యనిపుణులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. మారుతున్న వాతావరణ కాలుష్యం, పరిస్థితులు కార్బన్ సంబంధిత కాలుష్యంపై మనిషిపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. కొన్ని సందర్భాల్లో డ్రగ్స్‌కు కూడా అందని విధంగా అలర్జీలు పెరుగుతున్నాయన్నారు. ఉబ్బసంతో బాధపడుతున్న వారి సంఖ్య పెరుగుతుందన్నారు. ఎన్నారై డీన్ డాక్టర్ లక్ష్మీ, సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ సుబ్రమణ్య శాస్త్రి, సదస్సు కన్వీనర్ డాక్టర్ కేవీఎస్ ప్రసాద్, జాతీయ పిల్లల అలర్జీ చాప్టర్ అధ్యక్షుడు డాక్టర్ కృష్ణమోహన్, జాతీయ కార్యదర్శి డాక్టర్ నారాయణరెడ్డి, కోశాధికారి ధనేష్ వాల్వేకర్, డాక్టర్లు కె మరళీధర్‌రెడ్డి, పి.అనిల్‌కుమార్, వి.రఘురామిరెడ్డి, పాల్గొన్నారు.